క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక టౌన్‌హాల్‌లో జై దుర్గాభవానీ వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం జరిగాయి. దీనిలో భాగంగా అధ్యక్షుడిగా కింతాడ సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దాడి సంతోష్, కోశాధికారిగా సనపల భూషణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎస్.ప్రసాద్, పి.నాగరాజు, ఎన్.వాసు, ఎస్.కేశవ, ఎ.శ్రీను, కె.ఈశ్వరరావు, వి.నందులు ఎన్నికయ్యారు.

వదంతులు నమ్మొద్దు

శ్రీకాకుళం క్రైమ్: సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే తప్పుడు వదంతులు మహిళలు నమ్మరాదని, సాధ్యమైనంతవరకు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నగరంలోని చౌదరి కాలనీ మహిళలకు సీఐ పి.ఈశ్వరరావు స్పష్టం చేశారు. నారీ శక్తి పేరిట మహిళల భద్రత, గుడ్‌టచ్ –బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, శక్తియాప్, దయల్ 112, 1930, 100 గురించి మహిళలకు అవగాహన కల్పించారు.

దళితవాడల్లో విజ్ఞాన కేంద్రాలు నిర్మించండి



మాట్లాడుతున్న కంఠ వేణు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దళితవాడల్లో విజ్ఞాన కేంద్రాలు నిర్మించాలని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా: కంఠ వేణు కోరారు. ఒక ప్రైవేటు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావుపూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ గారి పేర్లతో విజ్ఞాన కేంద్రాలను, సామాజిక భవనాలను ఏర్పాటు చేయాలన్నారు. అందులో మహనీయుల జీవిత చరిత్రలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు, భారత రాజ్యాంగ సారాంశం వివరించే పుస్తకాలు ఉంచి సమ సమాజ నిర్మాణానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణోత్సవం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. భాద్రపద బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా అనివెట్టి మండపంలో ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి కల్యాణమూర్తులను కొలువుదీర్చి ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. కల్యాణ సేవలో పాల్గొన్న భక్తదంపతులకు అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఇరువర్గాల కొట్లాట

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఫాజుల్‌బేగ్‌పేటలో అప్పిచ్చిన సొమ్ము కోసం ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు బుధవారం వెల్లడించారు. కత్తెరవీధిలో నివసిస్తున్న మధుగుంట సుధారాణి ఫాజుల్‌బేగ్‌పేటలో ఉంటున్న పొడుగు కావ్యశ్రీ అత్త మంగమ్మకు ఏడాది క్రితం రూ.6 లక్షలు అప్పుగా ఇచ్చింది. అసలు లేకపోయినా వడ్డీ అయినా ఇవ్వకపోవడంతో ఈనెల 15 మధ్యాహ్నం సుధారాణి వెళ్లి అడగడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి కొట్లాటకు దారి తీసింది. దీనిపై ఇరువైపులా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ రజనీ తదితరులు

ఎచ్చెర్ల: ఉమెన్ ఇన్ ఇంజినీరింగ్ పథకంలో భాగంగా సాంకేతిక విద్య చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు శిక్షణా ఫౌండేషన్, హిటాచీ సంస్థ అందించే ఆర్థిక సాయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ కళాశాల ఈఈఈ విభాగానికి చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. జేఎన్‌టీయూ, జీవీ(విజయనగరం)లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ల్యాప్‌టాప్‌లు, సంబంధిత కిట్ బ్యాగులు, హిటాచీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మోహన్‌కాగ్డే (ముంబై) శిక్షణా ఫౌండేషన్ ఆపరేషన్స్ మేనేజర్ అర్.అప్పారావు చేతులమీదుగా అందుకున్నారు. ఈ సంస్థలు గతంలో చేసిన ఇంటర్వ్యూల ద్వారా వీరిని ఎంపిక చేశారు. దీంతో విద్యార్థులను వర్సిటీ వీసీ కేఆర్ రజనీ బుధవారం తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ రాజశేఖరరావు, బీసీడీఈ సమన్వయకర్త డా.బి.అజయకుమార్, ఈఈఈ విభాగ సమన్వయకర్త టి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం గాలికి..?

- గ్రామాల్లో వైద్య శిబిరాలకు మంగళం
- గత ప్రభుత్వంలో స్పెషలిస్టు డాక్టర్లతో వైద్య సేవలు
- ఉచితంగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ
- ఏడాదిన్నర పాలనలో ఉసెత్తని కూటమి ప్రభుత్వం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

రణస్థలం: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే దృక్పథంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పేదలకు నిపుణులైన వైద్యులతో 14 రకాల వైద్య సేవలను గ్రామాల్లోనే శిబిరాలు ఏర్పాటు చేసి అందించారు. అనంతరం అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేసేవారు. మరీ అనారోగ్యం తీవ్రంగా ఉంటే ఆ వైద్యులే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స నిమిత్తం సామాజిక, సర్వజన ఆస్పత్రులకు రిఫర్ చేసి చికిత్స అందించేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో వైద్య సేవలు గాలికి వదిలేశారు.

అనారోగ్యాల బారిన ప్రజలు

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లెల్లోని ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జ్వరం వస్తే గ్రామీణ ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి వేలకు వేలు వదులచ్చుకుంటున్నారు. అదే అనారోగ్యం తీవ్రంగా ఉంటే ఆ గ్రామీణ ప్రైవేట్ వైద్యులే ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రూ.లక్షల్లో ఖర్చులు పెట్టాల్సిన పరిస్థితి దాపురించింది. కొన్ని వైద్య సేవలకు ఆరోగ్యశ్రీ ఉన్నా.. అత్యవసరంగా వైద్యం చేయాలని ప్రైవేటు ఆస్పత్రులు తొందర పెడుతుండడంతో తమ కష్టార్జితాన్ని దారబోస్తున్నారు. గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు విశేష కృషి చేశారు. దీని కోసం ఎన్నో కార్యక్రమాలు అప్పటి ప్రభుత్వం చేపట్టింది. అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించేవారు. ఆరోగ్యశ్రీలో లేని వాటికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసి ఆదుకున్నారు. చిన్న పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకల వంటి వివిధ రోగాలకు సంబంధించి కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వీటితో పాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాలను నిర్వీర్యం చేయడంపై సర్వత్రా ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహిస్తే, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

పేదలకు ఇబ్బందులు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేశారు. పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు వైద్య శిబిరాలు లేకపోవడంతో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– రాయపురెడ్డి భుజంగరావు, వైస్ ఎంపీపీ, రణస్థలం

చిత్తశుద్ధి లేదు



గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వంటివి ప్రబలితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రజల ఆరోగ్యంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. కాబట్టే ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.

– అల్లిపల్లి సత్తిరాజు, కొవ్వాడ గ్రామం, రణస్థలం

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

గార: గత ప్రభుత్వంలో చేపట్టిన నాడు–నేడు పనుల్లో భాగంగా పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీకూర్మం, అంపోలు, మత్స్యలేశం, కొర్ని తదితర పాఠశాలలను ఎస్టీయూ సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగంగా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకూర్మంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో మన బడి – మన భవిష్యత్ పేరున పనులు చేస్తామని చెప్పినా, ఇప్పటివరకు ప్రారంభించలేదన్నారు. రణస్థలం మండలంలోని పాతర్లపల్లి ఘటన తర్వాతనైనా అధికారుల్లో, ప్రభుత్వంలో కనీస స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. నూతన మూల్యాంకన విధానాన్ని పునః సమీక్షించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ, మండల నాయకుడు ఎం.తేజ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ప్రకాశరావు



శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీడీవోగా వెంకుమహంతి ప్రకాశరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఈయన రణస్థలం మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసి పదోన్నతిపై శ్రీకాకుళం ఎంపీడీవోగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఎంపీడీవోగా పనిచేసిన బొడ్డేపల్లి శైలజ పలాస బదిలీపై వెళ్లారు.

దేశాభివృద్ధిలో యువతదే కీలకపాత్ర



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బింగి చిట్టిబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశం అభివృద్ధి చెందాలంటే యువత కీలక పాత్ర పోషించాలని, భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎ.సోమేశ్వరరావు అన్నారు. మేరా యువ భారత్ (ఎన్‌వైకే) శ్రీకాకుళం సౌజన్యంతో నగరంలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో వికాస్ దివాస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బింగి చిట్టిబాబు మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరగాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సూపరింటెండెంట్ లోపింటి రేఖ, పర్సనాలిటీ డవలప్‌మెంట్ ట్రైనర్ దూసి సంతోష్, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ ఆధ్వర్యంలో మన ఊరు – మన బాధ్యత అనే నినాదంతో స్వచ్ఛతాహీ సేవా ఉత్సవ్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి సూర్యమహల్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. స్వచ్ఛతాహీ సేవా ఉత్సవ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ఇటీవలే జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్‌గా బాధ్యతలందుకున్న పొన్నాడ రవికుమార్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డా.పైడి సింధూర ఆధ్వర్యంలో జూట్ సంచులను, గుడ్డ సంచులను పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్ కుమార్, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి



శ్రీకాకుళం క్రైమ్: విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ కేవీ రమణ తదితరులు



శ్రీకాకుళం కల్చరల్: విశ్వకర్మ విగ్రహం ఊరేగింపు నిర్వహిస్తున్న స్వర్ణకార సంఘం ప్రతినిధులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: విశ్వకర్మ జయంతి పురస్కరించుకొని మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



జి.సిగడాం: విశ్వకర్మకు పూజలు చేస్తున్న దృశ్యం



రణస్థలం: విశ్వకర్మ చిత్రపటానికి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



రణస్థలం: ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

కళలు, చేతివృత్తుల నిర్మాణాలకు విశ్వకర్మ ఆది గురువు అని వక్తలు అన్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో విశ్వకర్మ జయంతిని బుధవారం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. పలుచోట్ల విశ్వకర్మ విగ్రహాలను ఏర్పాటు చేసి తిరువీధి, ప్రత్యేక పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సమస్యలు పరిష్కారమవ్వని సభలెందుకు..?

- సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

జి.సిగడాం: గ్రామాల్లో నెలకున్న ప్రజా సమస్యలను పరిష్కారం చేయని సమావేశాలు ఎందుకని, అధికారుల పనితీరు మారడం లేదని సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, ధారబోయిన రెయిమ్మ, బత్తుల స్వాతి, పున్నాన సోనియా, భూపతి సురేష్‌కుమార్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంట పొలాలకు సకాలంలో ఎరువులను అందించి ఆదుకోవాలని వైస్ ఎంపీపీలు మీసాల సాధ్వమణి, తోలేటి వెంకటరావు, గౌరవ సభ్యులు కుమరాపు రమేష్‌నాయుడు, పెద్ది శ్రీనివాసరావు, గేదెల వరలక్ష్మి, కీర్తి తవుడమ్మ, సంతవురిటి, పాలఖండ్యాం సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, ధారబోయిన రెయిమ్మ తదితరులు కోరారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు.

1,863 మెట్రిక్ టన్నుల యూరియా

ఏవో బెండు బాబ్జీ మాట్లాడుతూ.. మండలానికి 1,863 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరవ్వగా, ఇప్పటివరకు 1,589 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. ఎక్కడైనా అర్హులైన రైతులు ఉంటే వారికి యూరియా అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. డీఆర్‌వలస గ్రామంలో ఉన్న భూ రికార్డులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రికార్డులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌వలస ఎంపీటీసీ కుమరాపు రమేష్‌నాయుడు విన్నవించుకున్నారు. దీనిపై తహసీల్దార్ మహదేవు సరిత స్పందిస్తూ.. భూ రికార్డుల విషయంలో ఉన్నతాధికారుకు సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, సహకార సంఘం చైర్మన్ బెవర జగన్నాథరావు, ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, ఐసీడీఎస్ పీవో డోల పాపినాయుడు, వైద్యులు పేకల సుమబిందు, ఉప్పాడ సుమన్, ఎంఈవో అరసాడ రవి, విద్యుత్ శాఖ ఏఈఈ పైడి దుర్గాప్రసాద్, ఏఈఈలు లతాశ్రీ, కుసుమ, ఏపీవో సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



ఎచ్చెర్ల: రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల:

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ కేఆర్ రజనీ అన్నారు. పీఎం నరేంద్రమోదీ పుట్టినరోజు పురస్కరించుకొని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ, జిల్లా సర్వజన ఆస్పత్రి రక్తనిధి కేంద్రంతో కలిసి బీఆర్ ఏయూ ఎన్ఎస్ఎస్ శాఖ రక్తదాన అమృత మహోత్సవ్–2 కార్యక్రమాన్ని క్యాంపస్‌లో బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణం కోసం రక్తదానానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డా.ఎస్ ఉదయభాస్కర్, డా.ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డా.డి.వనజ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో 60 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

రణస్థలం: పీఎం నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 116 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌టీసీలో స్నాతకోత్సవం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం డీఎల్‌టీసీ (ఐటీఐ) శిక్షణా కేంద్రంలో బుధవారం స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా సరిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ యువత చదువుతోపాటు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. నచ్చిన రంగంలో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఐఎంసీ చైర్మన్ ఎం.గోపాలరావు, టాటా స్ట్రీవ్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సంతోష్, భారతి ఐటీఐ కరస్పాండెంట్ చిట్టి నాగభూషణంలు ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డీఎల్‌టీసీ శిక్షణాధికారులు వి.రఘురామ్, ఎం.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన భాషోపాధ్యాయులు



డీఈవోను అభినందిస్తున్న సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం: జిల్లా విద్యాశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టిన అడారి రవిబాబును రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకుల ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో భాషోపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. క్లస్టర్ ఉపాధ్యాయులుగా, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న భాషోపాధ్యాయులను, భాషల బోధనకు అవసరమైన చోటికి పంపించాలని కోరారు. డీఈవోను కలిసినవారిలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ముఖ్య సలహాదారు రఘుపాత్రుని శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు కుప్పన్న గారి శ్రీనివాసరావు, గొడబ మేరీ ప్రసాద్, అరసవల్లి గణపతిరావు, లోలుగు సత్యం, లోలుగు వెంకటరమణ, గండ్రేటి వినయ్ కుమార్, రుప్ప తులసీదాస్, ఉప్పు త్రినాథరావు, మాడుగుల కాంతారావు, షేక్ జాఫర్, చింతపల్లి జనార్ధనావు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార మాసోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వలన బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఐ.విమల అన్నారు. నగరంలోని కృష్ణాపార్కు సెక్టారు పరిధి గాజులవీధి అంగన్‌వాడీ కేంద్రం, రిమ్స్ ఆరోగ్య కేంద్రం ఆవరణలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ మాస కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అంతకుముందు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఐసీడీఎస్ కార్యాలయ నోడల్ అధికారి మణి, అర్బన్ ప్రాజెక్టు అధికారి నాగరాణి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, కల్యాణి, యశోద, యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సకాలంలో తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సీడీపీవో డోల పాపినాయుడు సూచించారు. జి.సిగడాం గ్రామంలో పౌష్టికాహారం మాసోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సులో పాల్గొన్ని మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకుంటే అనేక వ్యాధుల నుంచి బయటపడవచ్చన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి, కార్యకర్తలు మహాదాస్యం రాధిక, సువ్వాడ రమాదేవి, శిల్లా భారతి, ఏఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు రమణమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

శ్రీకాకుళం: విద్యార్థులు సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థి విజ్ఞాన మంథన్(వీవీఎం) జిల్లా కో–ఆర్డినేటర్ ఎ.పున్నయ్య సూచించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు వీవీఎంపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.